నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏడీఈ ప్రేమానంద్ పాయ్ తెలిపారు. గాంధీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 7 నుంచి 7.30, బ్యాంక్ ఆఫ్ బరోడా పరిధిలో ఉదయం 7.30 నుంచి 8, శంకర్‌మఠ్ పరిధిలో ఉదయం 6 నుంచి 6.30, సాయిబాబా టెంపుల్ పరిధిలో ఉదయం 6.30 నుంచి 7, ఆప్కో, వైఎంసీఏ పరిధిలో ఉదయం 7 నుంచి 7.30, డీడీహెచ్ పరిధిలో ఉదయం 7.30 నుంచి 8, సీసీష్రాఫ్ పరిధిలో ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

సిద్దికనగర్‌లో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నేడు

ముషీరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ సిద్దిక్ నగర్‌లో ఎస్ఆర్‌డీ, రెయిన్‌బో కమ్యూనిటీ కేర్ అండ్ లెర్నింగ్ సెంటర్ సంయుక్తాధ్వర్యంలో శనివారం ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామని ఎస్ఆర్‌డీ ప్రతినిధి ఇందిరాభారతి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.


మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

చంద్రన్న నాయకత్వాన్ని తిరస్కరిస్తున్నాం

రాంనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చంద్రన్న నాయకత్వాన్ని తిరస్కరిస్తున్నామని, ఆయనతో తెగతెంపులు చేసుకుంటున్నామని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీలు తీర్మానం చేశాయి. ఈ మేరకు శుక్రవారం జరిగిన జనర్‌బాడీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని, ఉభయ రాష్ట్రాలకు చెందిన ఉద్యమ సమన్వయం కోసం ఐదుగురు సభ్యులతో కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేశామని, కమిటీకి సాధినేని వెంకటేశ్వరరావు కన్వీనర్‌గా వ్యవహరిస్తారని సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సాధినేని వెంకటేశ్వరరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కె. గోవర్ధన్, వి. సంధ్య ఎం.శ్రీనివాస్, రణ్‌దీప్, మామిడాలభిక్షపతి, అనురాధ ఒక ప్రకటన విడుదల చేశారు. న్యూడెమోక్రసీ పార్టీ అఖిలభారత ప్రధానకార్యదర్శిగా కొనసాగుతున్న చంద్రన్న తన సుదీర్ఘ విప్లవ జీవితానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

నేడు ఆర్టీసీ డయల్ యువర్ డీఎం

బర్కత్‌పుర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సూచనలు, సలహాలు స్వీకరించేందుకు శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం. వేణుగోపాల్ తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు 9000406069 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్‌ల చైర్మన్‌లుగా

మహిళలను నియమించాలి

బర్కత్‌పుర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఈబీసీ బోర్డుతోపాటు రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్‌లకు చైర్మన్‌లుగా ఆయా వర్గాలకు చెందిన మహిళలను నియమించాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం. భాగ్యలక్ష్మి కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో ఓబీసీ కార్యాలయంలో రెడ్డి కార్పొరేషన్ సాధన కోసం పోరాటం చేసి విజయం సాధించిన లతారెడ్డిని సత్కరించారు. జాతీయ బీసీ మహిళా సమాఖ్యకు లతారెడ్డి అధ్యక్షురాలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్‌ల సాధనకు ఎంతోమంది మహిళలు పోరాటం చేశారని, వారిని గుర్తించి పాలక మండలి చైర్మన్‌లుగా నియమించాలని, అప్పుడే వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఓబీసీ సెంట్రల్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


లతారెడ్డిని సత్కరిస్తున్న భాగ్యలక్ష్మి


మాట్లాడుతున్న విజయేంద్రసాగర్

సగర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాంనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సగర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అఖిల భారత సగర మహాసభ అధ్యక్షుడు శెన్‌శెట్టి విజయేంద్రసాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లిలో మహాసభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి హనుమంత్‌సాగర్, కోశాధికారి పార్థసారధితో కలిసి ఆయన మాట్లాడారు. కుల ప్రతిష్ఠను దిగజార్చిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజేశ్‌సాగర్, శ్యామ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువతిపై డెలివరీ బాయ్ అత్యాచారం

బంజారాహిల్స్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): డిన్నర్ చేద్దామని ఓ యువతిని హోటల్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేసిన డెలివరీ బాయ్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. నగరానికి చెందిన యువతి (23) ఎనిమిది నెలల క్రితం ఓ సైన్స్ కాన్ఫరెన్స్‌కు హాజరైంది. ఆకలి కావడంతో జొమాటోలో ఆహారం ఆర్డర్ చేసింది. జొమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేసే ఓబెదుల్లా ఖాన్ ఆమెకు ఆహారం ఇచ్చాడు. డబ్బు గూగుల్ పే ద్వారా చెల్లించింది. ఈ సమయంలో ఇద్దరి మధ్య ఫోన్ నంబర్ల మార్పిడి జరిగింది. తరుచూ ఫోన్‌లో మాట్లాడుకునే వారు, కలిసేవారు. ఈనెల 27వ తేదీన యువతిని ఓబెదుల్లా ఖాన్ కలిశాడు. ఇద్దరూ కలిసి పలు చోట్ల తిరిగారు. డిన్నర్ చేసుకుంటూ మాట్లాడుకుందామని ఆమెను బంజారాహిల్స్‌లో హోటల్ రూమ్‌కు తీసుకెళ్లాడు. కొద్ది సేపు మాట్లాడుకున్న తర్వాత యువతిపై అత్యాచారం చేశాడు. ఈ విషయం బయటకు చెప్పవద్దన్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఓబెదుల్లా ఖాన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తామని మోసం

యుసుఫ్‌గూడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను ఇద్దరు యువకులు మోసం చేశారు. వారి నుంచి రెండు లక్షల రూపాయలు కాజేశారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ వాజిద్ అనే యువకుడు వెంగళరావునగర్‌లో హాస్టల్‌లో తన మిత్రులు వినోద్, లక్ష్మణ్‌తో ఉంటూ చదువుకుంటున్నాడు. వీరికి హాస్టల్‌లో ఉంటున్న పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతానికి చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి అనంతపురం ప్రాంతానికి చెందిన సిద్ధార్థ్‌ను పరిచయం చేశాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, కొంత నగదు చెల్లించాలని సిద్ధార్థ్ వారితో చెప్పాడు.

దీంతో గత ఏడాది సెప్టెంబర్ 15న వినోద్ రూ. 20వేలు, 21వ తేదీన వాజిద్ రూ. 10వేలు ప్రవీణ్‌కు పంపారు. డబ్బు తీసుకొని నకిలీ ఆఫర్ లెటర్లు వారికి అందజేశాడు. వినోద్, లక్ష్మణ్ తరచూ పెద్ద మొత్తంలో ప్రవీణ్‌కు, సిద్ధార్థ్‌కు దాదాపు రూ. 2 లక్షల వరకు ఇచ్చారు. డిసెంబర్ వరకు వీరికి ఎలాంటి జాయినింగ్ లెటర్లు ఇవ్వలేదు. అనుమానం వచ్చిన స్నేహితులు సిద్ధార్థ్, ప్రవీణ్‌ను నిలదీయగా వారికి మాయ మాటలు చెబుతూ మీ డబ్బులు తిరిగి ఇస్తామని నమ్మించారు. పదేపదే డబ్బులు అడగడంతో తమను వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేయడంతో పాటు మళ్లీ బెదిరింపులకు పాల్పడడంతో బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.




ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో సువార్త ర్యాలీలో క్రైస్తవులు

రాంనగర్ సెయింట్ పాయిస్ స్కూల్‌లో ఏసును శిలువ వేస్తున్న సన్నివేశం

ఏసుప్రభువు చూపిన బాటలో నడుచుకోవాలి

చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు

ముషీరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే సందర్భంగా రాంనగర్ సెయింట్ పాయిస్ స్కూల్ ప్రాంగణంలో సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అసిసి చర్చి ఆధ్వర్యంలో ఏసుప్రభువును శిలువ వేసే ప్రదర్శనను నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువపై మరణించక ముందు ప్రజలకు చెప్పిన ఏడు మాటలను వివరించారు. చర్చి ఫాదర్ ప్రవీణ్ డిసౌజా దైవ సందేశం ఇచ్చారు. క్రైస్తవులు సామూహిక ప్రార్థనలు నిర్వహించి భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం ఫాదర్ మాట్లాడుతూ.. మానవాళిని పాపవిముక్తులను గావించేందుకు శిలువపై మరణం పొందిన ఏసుప్రభువు చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని అన్నారు. చర్చి ఫాదర్ చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సువార్త ర్యాలీ

చిక్కడపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ క్రాస్‌రోడ్‌లోని హెబ్రోన్ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా సువార్త ర్యాలీ నిర్వహించారు. చర్చి సొసైటీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పీజే కురియన్, ఆర్. వీరాచారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతి, కరుణ సందేశాలతోపాటు క్రీస్తు నేర్పిన సేవ, దయ, సోదరభావం మానవాళికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. క్రీస్తు త్యాగాల జ్ఞాపకంగా గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు జరుపుకున్నారని అన్నారు.

బాలికల వసతి గృహంలో

పుస్తకాలు, పండ్లు పంపిణీ

ముషీరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ ఆధ్వర్యంలో శుక్రవారం భోలక్‌పూర్‌లో ప్రభుత్వ బాలికల వసతి గృహంలో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని విద్యార్థినులకు పండ్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మైండ్ అండ్ పర్సనాలిటీకేర్ డైరెక్టర్ పద్మాకమలాకర్ గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యతను పిల్లలకు వివరించారు. ప్రేమ, దయ, క్షమాపణ గుణం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణవేణి, జ్యోతిరాజా, హాస్టల్ వార్డెన్ భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.



భోలక్‌పూర్‌లో బాలికలకు పండ్లు, పుస్తకాలను పంపిణీ చేసిన డాక్టర్ పద్మాకమలాకర్

ఘనంగా టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం


నగర కార్యాలయంలో టీడీపీ జెండా ఎగురవేసి ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న సాయిబాబా తదితరులు

రాంనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని బాగ్‌అంబర్‌పేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జాతీయ కార్యదర్శి జె. దశరథ్ ముఖ్యఅతిథి పాల్గొని జెండా ఆవిష్కరించ కేక్ కట్ చేశారు. టీడీపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా ఆధ్వర్యంలో పార్టీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో భానుప్రకాశ్, ఇ. సత్యనారాయణ, నల్లెల కిశోర్, బాల్‌రాజ్‌గౌడ్, పరశురామ్, యాదగిరిరావు, కృష్ణాగౌడ్, అన్నపూర్ణ, జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి టీడీపీ కృషి

రాంనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి టీడీపీ కృషి చేస్తుందని మాజీ కార్పొరేటర్, తెలుగుదేశం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయం చౌరస్తాలో పార్టీ జెండా ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలోనేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో భిక్షపతి, గోవర్ధన్, సాధినేని వెంకటేశ్వర్‌రావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.


అంబర్‌పేటలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేష్ చౌదరి, పరశురామ్, నరసింహగౌడ్ తదితరులు


చిక్కడపల్లిలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

భవిష్యత్తు దర్శనం చేసే రచనలు చేయాలి

చిక్కడపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సాహితీవేత్తలు వర్తమాన సంఘటనలపై స్పందించడమే కాక భవిష్యత్తు దర్శనం చేసే రచనలు చేయాలని వేంకటేశ్వరయూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఆచార్య కొలకలూరి మధుజ్యోతి రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యసృష్టి దృష్టి గ్రంథావిష్కరణసభ శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇనాక్ గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మధుజ్యోతి ఏడు ప్రక్రియలపై లోతైన అధ్యయనం చేసి పరిశోధనకు సరిపడా విశ్లేషణ తన గ్రంథంలో చేశారని అభినందించారు.

గ్రంథరచయిత మధుజ్యోతి మాట్లాడుతూ.. ఇనాక్ సాహిత్యం సమస్తం ప్రేమతత్వంతో ముడిపడి ఉంటుందన్నారు. స్త్రీ హక్కులు స్వేచ్ఛ గురించి ఎవరూ మాట్లాడని రోజుల్లో ఐదు దశాబ్దాల కిందటే ఇనాక్ తనసాహిత్యంలో వాటి గురించి ప్రస్తావించారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, చక్రపాణి, గుండవరపు గీతాదేవి, ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఇనాక్ తదితరులు


డాక్టర్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్షత్రియ మహాసభ ప్రతినిధులు

రాజ్‌పుత్ బొందిలి సమాజాన్ని ఓబీసీలో కలపాలి

రాంనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాజ్‌పుత్ బొందిలి సమాజాన్ని ఓబీసీలో కలపాలని అఖిలభారతీయ క్షత్రియ మహాసభ డిమాండ్ చేసింది. శుక్రవారం కేంద్ర ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభసభ్యుడు డా. కె. లక్ష్మణ్‌ను మహాసభ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహాసభ ఉపాధ్యక్షుడు విజయ్‌సింగ్, రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాజ్‌పుత్ బొందిలి సమాజం బీసీ జాబితాలో ఉండడంవల్ల అభివృద్ధికి నోచుకోక అవకాశాలను కోల్పోతున్నారన్నారు. లక్ష్మణ్‌ను కలిసిన వారిలో అజయ్‌సింగ్, శక్తిసింగ్ తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన

మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

చిక్కడపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జ్ఞానేశ్వరి రవిప్రసాద్


కాచిగూడలో ప్రచారం నిర్వహిస్తున్న కావ్యాకిషన్‌రెడ్డి

బీజేపీకి ప్రజలు అండగా నిలవాలి

బర్కత్‌పుర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఏబీవీ ఫౌండేషన్ చైర్మన్ కావ్యా కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కాచిగూడ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి పలు అపార్ట్‌మెంట్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కావ్యారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు బీజేపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు కృష్ణకుమార్, క్షీరసాగర్, అజారిబాబు, అశోక్‌కులకర్ణి, మల్లికార్జున్, భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

పంజాగుట్ట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలని బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మీనగ గోపీ బోయ డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హలో వాల్మీకి.. చలో హైదరాబాద్ పేరుతో మేధావులు, డీఎన్‌టీ, ఎంబీసీ, బీసీ కుల సంఘాల ప్రతినిధులతో కలిసి శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మేధోమధన సదస్సు ఏర్పాటు చేశారు. తమ సామాజికవర్గం ఇతర రాష్ట్రాల్లో ఎస్సీ ఎస్టీ జాబితాలో ఉండగా తెలంగాణలో బీసీ జాబితాలో ఉందని, వెంటనే వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని గోపి అన్నారు. తమకు ఒక ఎమ్మెల్సీ, ఎంపీ పదవి ఇవ్వాలని, కులవృత్తి లేని వారిని ఆదుకోవాలని, తాము ఆర్థికంగా ఎదగడానికి బోయ బంధు పథకం ప్రవేశపెట్టాలన్నారు. గద్వాల్‌లో ప్రత్యేక గురుకులాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, బీసీసేన అధ్యక్షుడు బీ.కృష్ణయాదవ్, సమితి ఉపాధ్యక్షులు జి.రాజేశం, పి.అంజయ్య, ప్రధాన కార్యదర్శి బోగె చందర్‌రావు, జి.యాదయ్య, నరేష్, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు


దానంను కలిసి మద్దతు తెలుపుతున్న రాజేశ్వర్ యాదవ్

దానం గెలుపునకు బీసీలు కృషిచేయాలి

బర్కత్‌పుర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతు తెలుపుతున్నట్లు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎ. రాజేశ్వర్ యాదవ్ తెలిపారు. ఆయన శుక్రవారం దానంను కలిశారు. దానం నాగేందర్ గెలుపునకు బీసీలు కృషి చేయాలని రాజేశ్వర్ యాదవ్ పిలుపునిచ్చారు.

కుటుంబ కలహాలతో

ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ ఉద్యోగి ఆత్మహత్య

అల్వాల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల కారణంగా హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. అల్వాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన ప్రహ్లాద్‌కుమార్(40)కు అదే ప్రాంతానికి చెందిన శుభశ్రీతో వివాహం అయింది. వీరికి ఒక బాబు. ప్రహ్లాద్‌కుమార్ కొన్నేళ్లుగా హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తూ అక్కడే క్వార్టర్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. భార్యభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వీరికి ఫ్యామిలీ కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. అయినా గొడవపడుతున్నారు. గురువారం రాత్రి దంపతులు ఇద్దరూ గొడవపడ్డారు. మనస్తాపం చెందిన ప్రహ్లాద్‌కుమార్ రాత్రి 11.30 గంటల సమయంలో ఇంట్లో బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గణితశాస్త్రంలో ఖాసీం అలీకి డాక్టరేట్



రామంతాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్రంలో సమర్పించిన పరిశోధన పత్రానికిగాను రామంతాపూర్‌కు చెందిన ఖాసీం అలీకి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. న్యూమరికల్ స్టడీ ఆఫ్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్ ఇన్ కోయిటి ఫ్లో అనే అంశంపై సమర్పించిన పరిశోధన పత్రానికి ఖాసీం అలీకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఎ.అరుణకుమారి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఖాసీం అలీని పలువురు అభినందించారు.

వ్యక్తి అదృశ్యం

జవహర్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పనికోసం వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌వో నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్టలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పల్లెబోయిన శివప్రసాద్(35) బాలాజీనగర్‌లో వెంకటేశ్వర దేవాలయం సమీపంలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు.

ఈనెల 27వ తేదీన పనికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య పుష్ప పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శివప్రసాద్

వ్యాపారి ఇంట్లో వజ్రాభరణాలు చోరీ

బంజారాహిల్స్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వ్యాపారి ఇంట్లో వజ్రాభరణాలు చోరీ అయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లో నివసిస్తున్న యష్‌లల్వాని వ్యాపారి. ఫిబ్రవరి 2న ఆయన తల్లి బీరువాలో వజ్రాలతో కూడిన బంగారు నెక్లెస్‌తో పాటు వజ్రాల చెవికమ్మలు పెట్టింది. వివాహ వేడుకకు వెళ్లేందుకు అదే నెల 12న బీరువా తెరిచి చూడగా ఆభరణాలు కనిపించలేదు. సీసీ కెమెరాలు పరిశీలించగా ఇంట్లో పనిచేసే బిహార్‌కు చెందిన సాహెబ్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని ప్రశ్నించగా.. సరైన సమాధానం చెప్పలేదు. దీంతో యష్‌లల్వాని బంజారాహిల్స్ పోలీసులకు ఈనెల 28న ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.